www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 11 | జూలై | 2026
పేజీలు : 8

## పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలి




-కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి
-ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
-విద్యా సంస్థల బంద్ విజయవంతం
-వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

2లో

# మేడిగడ్డ నింపితే భద్రాచలం మునకే..

-డి లిమిటేషన్ తప్పదు
-కాంగ్రెస్ విజయం తథ్యం
-బ్యాండ్ మేళం సర్వేలు నిజం కావు
-సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామి
-రైతాంగ సానుకూల ప్రభుత్వం
-ఖమ్మం సభలో రేవంత్







**ప్రజాపక్షం/ఖమ్మం :** బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టును నింపితే భద్రాచలం సహా 24 గ్రామాలు మునిగిపోక తప్పదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ నిర్మాణంలో డొల్లతనం బయటపడిందని ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ పార్టీ భారీ అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుకున్నట్లుగానే డి లిమిటేషన్ వస్తుందని దానితో పాటే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్లమెంటుల మెజార్టీ సాధించేందుకు బిజెపి రాజకీయ పార్టీలను చీలుస్తుందని, డి లిమిటేషన్‌తో రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని శాసన సభ స్థానాలు 182కు

మిగతా 2లో..

# చెక్కు చెదరని సాగర్, శ్రీశైలం







-కూలేశ్వరంగా మారిన కాళేశ్వరం
-తప్పుడు ప్రచారాలతో పబ్బం గడుపుకుంటున్న బిఆర్ఎస్
-తోడేళ్ల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుంటాం
-జగన్నాథపురం సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలో నిర్మించిన బహుళార్థక సాధక ప్రాజెక్టులు నాగార్జున సాగర్, శ్రీశైలం అనేక దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడుతుంటే బిఆర్ఎస్ నిర్మించిన ఒకే ఒక ప్రాజెక్టు కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన సభలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిపై కాంగ్రెస్ చేపట్టిన ప్రాజెక్టులకు రీ డిజైన్ పేరుతో లక్షన్నర కోట్లు దోపిడీ చేశారని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని సంక్షేమానికే పరిమితం చేయకుండా ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమిగా మార్చడమే తమ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూనే రాష్ట్ర భవిష్యత్తు కోసం దార్శనీక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని ముఖ్యంగా మహిళలను మహాలక్ష్మి లుగా తీర్చిదిద్దేందుకు రైతును రాజును చేసేందుకు ఈ ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. రెండున్నర ఏళ్ల కాలంలో రూ.67వేల కోట్లను లింకేజీల ద్వారా వడ్డీ లేని రుణాలను

మిగతా 2లో..



# మేడిగడ్డ నింపితే భద్రాచలం మునకే..

**(మొదటిపేజీ తరువాయి)**

పెరుగుతాయని పార్లమెంట్ స్థానాలు 26కు పెరుగుతాయని వీటిలో 117 అసెంబ్లీ స్థానాల్లోనూ, 20 పార్లమెంట్ స్థానాల్లోనూ విజయం సాధించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని ఆయన తెలిపారు. శుక్రవారం రైతు ఆశీర్వాద సభ పేరుతో ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా పాలమూరు జన్మనిస్తే అధికార ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయలా నిలిచిందన్నారు. 2023 జులైలో భట్టి పాదయాత్ర ముగింపు సభ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక దానికి రాహుల్ గాంధీ హాజరు కావడం రాజకీయ చరిత్రలో నిలిచిపోయిందని కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైందన్నారు. సరిగ్గా 36 నెలల తర్వాత జరుగుతున్న ఈ సభ ఇక ఖమ్మం జిల్లాలో బిఆర్‌ఎస్‌కు అవకాశం లేదని తేల్చి చెప్పిందని ఈ సభకు హాజరైన ప్రజలే ఇందుకు సాక్ష్యమన్నారు. 2023లో ఎన్నికలకు ముందే కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పానని 65 స్థానాలు వస్తాయని చెప్పానని ఇప్పుడు కూడా నేను చెప్పిందే జరుగుతుందని రేవంత్ స్పష్టం చేశారు. పార్లమెంట్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజా తీర్పు మాకు అనుకూలంగా వచ్చిందని అదే సందర్బంలో నేను చెప్పినట్లుగానే పాపాల భైరవుడు పామ్ హౌజ్‌లో బంధీ అయ్యాడన్నారు. కల్వకుంట్ల కుటుంబం కురు వంశం లాంటిదని ఇక తెలంగాణ రాజకీయ ముఖ చిత్రం నుంచి తొలిగిపోక తప్పదన్నారు. రాష్ట్రంలో 2028లో ఎన్నికలు జరగవని 2029 మే లేదా జూన్ మాసంలో ఎన్నికలు జరగవచ్చునని తెలిపారు. బిఆర్‌ఎస్ లోని కేసిఆర్, ఆయన కొడుకు, అల్లుడు బ్యాండ్ మేళంతో పోల్చదగిన సర్వేలు నిర్వహిస్తూ ఏదో లెక్కలె చెబుతున్నారని రిజర్వేషన్లు తేలకుండా పునర్ విభజన జరగకుండా ఎన్నికలు జరగని నేపథ్యంలో ఈ సర్వేలు ఎలా వస్తాయని రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా పేరుతో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇప్పటి వరకు తెలంగాణ రైతుల సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అంటే కరెంటు ఉండదని ప్రచారం చేస్తున్నారని బిఆర్‌ఎస్ నాయకులు కరెంటు వైరు పట్టుకుని చూస్తే ఏమి జరుగుతుందో తెలుస్తుందని కాకిలా మాడి మసై పోతారని రేవంత్ హెచ్చరించారు. మేడిగడ్డలో గేట్లు దించి నింపితే భద్రాచలంతో సహా ఊర్లు కొట్టుకు పోతాయని ఆయన గుర్తు చేశారు. జూబ్లీ హిస్ లాంటి ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పు చూసిన తర్వాత బిఆర్‌ఎస్‌లో మార్పు రాలేదని హరీష్‌రావు బిజెపితో మాట్లాడలేదని భద్రాచలం రాముని మీద మేనమామ కేసిఆర్ మీద ఒట్టెసి చెప్పగలడా అని రేవంత్ ప్రశ్నించారు. కవిత బిఆర్‌ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తున్నారని చెబుతుందని వందల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్ల నుంచి కొల్లగొట్టారని



చెబుతున్నా కవితను అడిగితే నిజం తెలుస్తుందన్నారు. ఖమ్మంలో కొందరు బిఆర్‌ఎస్ నాయకులకు కర్రు కాల్చి వాతపెట్టారని మరో సారి పెట్టక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని సమయస్ఫూర్తితో నడిపిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని సంక్షేమ పథకాలు పొందిన వారి ఓట్లు కాంగ్రెస్‌కు వేస్తే బిఆర్‌ఎస్‌కు డిపాజిట్లు కూడా రావన్నారు. ఇంత వరకు కేసిఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయలేదన్నారు. వాటికి మరింత మెరుగులు దిద్ది అమలు చేస్తున్నామన్నారు. మధిరకు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని తీసుకు వచ్చి లక్షలాది మందితో సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సభకు ముందు తొమ్మిది నుంచి 50 ఎకరాలు కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 1009 కోట్లను విడుదల చేశారు. మొక్కజొన్నలకు సంబంధించిన కొనుగోలు నగదును విడుదల చేసిన ముఖ్యమంత్రి భూధార్ కార్డులను కూడా రైతులకు అందజేశారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు ముఖ్యంగా మహిళలు హాజరయ్యారు. సభలో ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకటి శ్రీహరి ప్రసంగించగా మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎలు రాందాస్ నాయక్, రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్కు చెదరని సాగర్, శ్రీశైలం

**(మొదటిపేజీ తరువాయి)**

ఇచ్చామని రాజీవ్ ఆరోగ్యశ్రీని ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచామని అదే సమయంలో వడ్డీ లేని రుణాలను ఐదు నుంచి పది లక్షలకు పెంపుదల చేశామన్నారు. వ్యవసాయం వృత్తిగా కాకుండా సంస్కృతిగా భాసిల్లుతున్న చోట రాష్ట్ర స్థూల ఉత్పత్తికి అవసరమైన పెట్టుబడులను అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 167.877 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని గుంట నక్కలను, తోడేళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని విక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని ప్రచారం చేసిన వారికి తగు సమాధానం చెప్పే రీతిలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. అవినీతి సొమ్ముతో మీడియా సంస్థలను కొనుగోలు చేసి అబద్దాన్ని ప్రచారం చేస్తున్నారని బిఆర్‌ఎస్‌ను నమ్మితే మళ్లీ రాష్ట్రం సర్వ నాశనమన్నారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన రూ.8.21 లక్షల కోట్ల అప్పును తీరుస్తూనే ఒక పక్క సంక్షేమ పథకాలు, మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే వారి కుట్రలను నమ్మవద్దని భట్టి స్పష్టం చేశారు. ఉత్తమ విద్యను అందించేందుకు యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

### గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం : తుమ్మల

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతాంగం కోసం నీటిపారుదల రంగంతో కలుపుకుని రూ.1.60 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు ఆశీర్వాద సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం సృష్టించిన విద్వాంసాన్ని, ఇబ్బందులను అధిగమిస్తూ ఎన్ని అడ్డంకులు ఉన్న రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 30 నెలల కాలంలోనే రూ.36వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.72వేల కోట్లు రైతు బంధు క్రింద నిధులు జమ చేశారని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కేంద్రం సహకరించకున్నా మద్దతు ధరకు అన్ని పంటలను కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో కృష్ణా సాగర్ నీటికి ఇబ్బందులు తలెత్తిన సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించేందుకు దానిని రూపకల్పన చేసినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలించి సాగర్ ఆయకట్టుకు నీటిని అందిస్తున్నామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్‌ను పూర్తి చేసి ఆగస్టు 15 నాటికి సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి నీటిని అందిస్తామని తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేస్తే పాలేరుకు కూడా గోదావరి నీళ్లు వస్తాయని తెలిపారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో పాటు అన్ని శాఖల మంత్రుల సహకారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఖమ్మం జిల్లా ప్రజానీకం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు.

### ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన భూధార్ : పొంగులేటి

భూ భారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని రాబోయే రెండేళ్లలో ప్రతి భూమిని సర్వే చేసి సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డును అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతు ఆశీర్వాద సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూ భారతి పనులు జరుగుతున్నాయన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మధిర నియోజక వర్గంలోని ములుగుమాడు రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి 476 మంది రైతులకు మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డులు సిద్దం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతులకు అందిస్తామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధృడ సంకల్పంతో రెండున్నర ఏళ్లలోనే మహిళా సంఘాలకు రూ.63వేల కోట్ల రుణాలను సున్నా వడ్డీతో అందించిన ఘనత ప్రజా ప్రభుత్వానిదన్నారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 71వేల ఉద్యోగాలను భర్తీ చేశామని త్వరలో 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత పాలకులు తాము చేసిన తప్పులను, అబద్దాలను ఈ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రతి ఫిల్లర్‌లోనూ అవినీతి కనిపిస్తుందని చెప్పినవిధంగా ఇవాళ అదే నిజమైందన్నారు. అర్హులైన ప్రతి పేద వానికి ఇల్లు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు.

## పాఠశాలల మూసివేతను
# ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, పాఠశాలలు, కళాశాలలను ఆధునీకరించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో విద్యా సంస్థల బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పిజి కళాశాల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్ లు మాట్లాడుతూ ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు మసకబారుతున్నాయన్నారు. విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస వౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని ఆధునీకరించి వసతులను కల్పించాలని కోరారు. ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం అవలంభించిన విద్యా వ్యతిరేక విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు పరుస్తుందన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫీజులు, డోనేషన్ల పేరుతో దోచుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి మూడేళ్లు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యా రంగంపై దృష్టి సారించాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, గురుకులాల సంక్షేమ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులకు, ప్రజలకు, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపి, పవన్, వెంకట్, గాంధీ, శ్రీకాంత్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, శ్యామ్, భరత్, మనోజ్, మురళీ, సాధిక్, హరి, అవనిక, శ్రామిక తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిపై పడ్డ పిడుగు
### -మూడు లక్షల మేర ఆస్తి నష్టం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పిడుగు పడిన సంఘటన కామేపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని గరిడేపల్లి గ్రామానికి చెందిన భట్టు సునీత తన నివాసంలో నిద్రపోతున్న సమయంలో గురువారం అర్థరాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఇంటిపై పిడుగు పడింది. భారీగా శబ్దం రావడంతో ఏమి జరిగిందో తెలియక భయంతో ఇంట్లో వారంతా బయటకు పరుగులు తీశారు. పిడుగు పడిన సమయంలో వేరే గదిలో నిద్రిస్తుండటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇల్లు కొంత మేర ధ్వంసమైంది. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి
### -ఇన్సాఫ్ నేత సలాం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్నికల సందర్బంగా ముస్లింలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా ముస్లిం మైనార్టీల పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన తన్జీమ్ ఎ ఇన్సాఫ్ జిల్లా విస్తృత సమావేశంలో సలాం మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా మైనార్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని తెలిపారు. వక్ఫ్ భూములకు రక్షణ లేకుండాపోతుందన్నారు. మైనార్టీ కార్పోరేషన్, మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత ప్రాతిపదికన పాలన చేస్తుందని సర్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. పేద ముస్లింలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తీరు మారక పోతే ప్రజలు పునరాలోచన చేస్తారని ఆయన హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌కె సైదా అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాకూబ్, ఎండి రెహ్మాన్, షేక్ మస్తాన్, తుమ్మలగడ్డ యాకూబ్, షేక్ సైదాబేగం, ముజ్మీల్, వాహబ్ పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**-ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి**
**-ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సంస్థలు బంద్**




**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రభుత్వ విద్యా రంగం సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ తెలిపారు. వామపక్ష విద్యార్థి సంఘాల విద్యా సంస్థల బంద్‌లో భాగంగా శుక్రవారం రఘునాథపాలెం మండలంలో బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మండలంలోని కోయచలక, రేగులచలక, కోటపాడు, పాపటపల్లి, చిమ్మపుడితో పాటు పలు పాఠశాలల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా నేటికి యూనిఫాం అందించలేదని, పుస్తకాలు సరిగ్గా విద్యార్థులకు అందలేదన్నారు. అల్పాహార స్కీమ్ అమలు కావడం లేదన్నారు. రెండున్నర ఏళ్లు కావస్తున్నా విద్యా శాఖకు మంత్రి లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, విద్యా శాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గాడిచర్ల సత్యనారాయణ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు దొంతు గణేష్, ముద్రబోయిన సంజీవరావు, పోతనబోయిన నాగరాజు, మధు, షేక్ ఖాజా, గొడుగు ఉమేష్, షేక్ అఖిల్ పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులు అరెస్ట్

**113 కేజీల గంజాయి స్వాధీనం**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టౌన్ ఏసిపి రమణమూర్తి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి టూటౌన్ సిఐ బాలకృష్ణ, ఈగల్ టీమ్ సిఐ విజయ్, ఎస్ఐ రమేష్‌లు తమ సిబ్బందితో కలిసి ఖమ్మం బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన రెండు వాహనాలను నిలవరించి తనిఖీ చేయగా మహారాష్ట్రకు చెందిన నలుగురి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అల్లూరి జిల్లాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించారు. నింధితుల నుంచి 56 లక్షల విలువచేసే 113 కేజీల గంజాయి, రెండు కార్లు, నాలుగు మెబైల్ ఫోన్స్ ని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సిఐ బాలకృష్ణ తెలిపారు. అరస్ట్ అయిన వారిలో మహారాష్ట్రలోని ఉస్మాబాద్ జిల్లాకు చెందిన రదిజాదవ్, గోపినాధ్ సుక్లే, సంతోష్ థాయప్ప, మోహన్ భీకాజీ జాదవ్‌లు ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అల్లూరి జిల్లాకు చెందిన గంజాయి సరఫరాచేసే వ్యక్తి బసు అలియాస్ వాసు, కారు యజమాని భాపూసాహెబ్ యాదవ్ పరారీలో ఉండగా వారికోసం గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**విద్యార్థుల భారీ ర్యాలీ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు సత్తుపల్లిలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించి, ఉపాధ్యాయులు, లెక్చరర్లు తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సభకు తరలిన ప్రజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 9వ వార్డు నుండి మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బస్సులో తరలి వెళుతున్న ప్రజలతో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, మెప్మా అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రేస్ పట్టణ నాయకుడు చెరుకూరి కిరణ్ మహిళలతో బస్సులు ఎక్కే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరు గ్యారెంటీలతో మహిళలకు ఎంతో సౌకర్యం కల్పించిన కాంగ్రేస్ ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందని, నియోజకవర్గంలో రాందాస్‌నాయక్ అభివృద్ధికి సైతం ప్రజలు ఆకర్షితులయ్యారని సంతోష్ తెలిపారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

**వైరాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం**




**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆధునీకరించి కనీస మౌలిక సదుపాయాలు కలిపంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, శివ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా వైరా మండల కేందరలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా మధు, శివ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయులు ఖాళీలు, ప్రైవేటు విద్యాసంస్థలపై నియంత్రణ లేకపోవడం వలన ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం తగ్గుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని, శిధిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, లేకపోతే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, గోపి, సురేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత

**-ముగ్గురు నిందితులు అరెస్ట్**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని ప్రకాశ్‌నగర్ సమీపంలో వాహనాలు తనిఖీచేస్తున్న త్రీటౌన్ పోలీసులకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి 310 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సిఐ మోహన్‌బాబు తెలిపారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌కు చెందిన షేక్ నవాబు మున్వర్ అలియాస్ మున్న, జహిర్‌పురా తండాకు చెందిన రత్నావత్ సాయిదుర్గమహేష్, ప్రకాశ్ నగర్‌లో ఉంటున్న హనుమకొండ జిల్లా కాజీపేట విష్ణుపురికి చెందిన బైరబోయిన లోకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రం సైనతల ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఖమ్మం తీసుకువచ్చి దానిని చిన్న ప్యాకుట్లగా మార్చి ఒక్కొక్క ఫ్యాకెట్టు 500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ మోహన్‌బాబు తెలిపారు. నిషేదిత గంజాయిని సేవించిన, విక్రయించినా, రవాణాచేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రయవిక్రయాలు, రవాణ గురించి తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులు, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞాప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మదకద్రవ్యాలు, గంజాయి రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘాతో పాటు నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# 15న నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఇంచార్జి బండి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు నాగులపాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతతో చెలగాటమాడుతూ మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయలేదని విమర్శించారు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా యువతకు ఉపాధి నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని కోరారు. 15న జరిగే నిరుద్యోగ సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, నాయకులు భూక్యా ప్రసాద్, రావులపాటి నాగరాజు, వడ్రనపు మధు, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల బంద్ ప్రశాంతం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఏదులాపురం, జలగంనగర్, నాయుడుపేటతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల వద్ద ఏఐఎస్ఎఫ్ సంఘం యువకులు బంద్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం వంటి అంశాలపై నినాదాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మిడకంటి అభిరామ్‌రెడ్డి, సంఘం నాయకుడు జిల్లా మధు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/బోనకల్:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆధునికీకరించి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ ఇండ్ల సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా ఇండ్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళశాలల్లో మౌళిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, ప్రవేట్ విద్యాసంస్థలపై నియంత్రణ లేకపోవడం వల్ల ప్రభుత్వ విద్య బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మడుపల్లి గోపి, ఇండ్ల సంతోష్, తాళ్లూరి అభిలాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంగాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న బంద్‌లో భాగంగా మధిర పట్టణంలో ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గసమితిఆధ్వర్యంలోవిద్యాసంస్థలబంద్‌నిర్వహించారు.

# రైతు ఆశీర్వాద సభ దృశ్యమాలిక















# సింగరేణిలో సుస్థిర మైనింగ్‌కు మరో ముందడుగు

**-మైనింగ్ భూములకు పునర్జన్మ...**
**-వ్యవసాయంతో పచ్చదనం వైపు మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్**
**-ఏజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్**



**ప్రజాపక్షం/మణుగూరుః** బొగ్గు తవ్వకాల అనంతరం వినియోగం కోల్పోయిన గని భూములను పునరుద్ధరించి సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యవసాయం, హార్టికల్చర్, అగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమాలను అభివృద్ధి చేస్తూ సుస్థిర మైనింగ్ లక్ష్యాలను సాధించాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్ ఆదేశాల మేరకు మణుగూరు ఏరియాలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఏజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్ తెలిపారు. ఈ మేరకు మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు బేస్ వర్క్ షాప్ వెనుక భాగంలో 2.20 హెక్టార్లు (సుమారు 5.50 ఎకరాలు) విస్తీర్ణంలో వ్యవసాయ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. ఇప్పటికే భూమిని దుక్కి చేసి, చదును చేసి, సాగుకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఖరీఫ్ 2026 సీజన్కు అనుగుణంగా మొక్కజొన్న సాగుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు బేస్ వర్క్ షాప్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ స్వయంగా భూమి పూజ నిర్వహించి మొక్కజొన్న విత్తనాలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత ప్రభుత్వం, బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అన్ని బొగ్గు గనుల్లో మైన్ క్లోజర్ ప్లాన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించిన నేపథ్యంలో, గనుల పునరుద్ధరణలో భాగంగా వ్యవసాయం, హార్టికల్చర్, అగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమాలను అన్ని ఏరియాల్లో విస్తృతంగా చేపట్టాలని చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్ నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా గనుల తవ్వకాల వల్ల ఏర్పడిన దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలను తగ్గించడం, భూసారాన్ని పునరుద్ధరించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, భవిష్యత్ తరాలకు స్థిరమైన భూ వినియోగ వ్యవస్థను అందించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా గని పునరుద్ధరణలో భాగంగా వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ చేపట్టిన ఈ మొక్కజొన్న సాగు పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే, భవిష్యత్తులో ఇతర ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ప్రాంతాల్లో కూడా వ్యవసాయం / హార్టికల్చర్ / అగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడానికి మార్గం సుగమం కానుంది. పర్యావరణ పరిరక్షణ, గని భూముల పునరుద్ధరణ, భూసారాభివృద్ధి, జీవవైవిధ్య సంరక్షణతో పాటు సుస్థిర మైనింగ్ లక్ష్యాల సాధనలో ఈ కార్యక్రమం సింగరేణికి ఒక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ బి. మధన్ నాయక్, పిఓ ఎంఎన్ఐటీసీ ఈ. శ్రీనివాస్, మేనేజర్ ఎంఎన్ ఓసి టి. శ్రీరంగ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎంఎన్ఐటిసి సురేశ్, ఎంఎన్ఐటిసి పర్యావరణ అధికారి కిషన్ రామ్, ఏరియా పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్, ఏరియా ఫారెస్ట్ అధికారి బి. కల్యాణ్ , ఇంచార్జ్ సేఫ్టీ అధికారి నిఖిల్ ఆయర్, డిప్యూటీ మేనేజర్ వి. నిఖిల్, సంక్షేమ అధికారి డి. నరేశ్, ఏఐటియూసి పిట్ సెక్రటరీ సాయి ప్రకాష్ చారి, ఐఎన్టీయూసి పిట్ సెక్రటరీ ఇమియాజ్ పాషా, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలు బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జూలూరుపాడులో విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యింది. జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు జడ్పీఎస్ఎస్ పాఠశాల ముందు విద్యార్థి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పసుపులేటి పవన్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పృథ్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు అవుతున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించమంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి ట్టినట్టు వివరించడం బాధాకరమైన అన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలను 4 వేల కస్టర్ గా చేసి పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయండి డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వ విద్య విద్యార్థులకు తల్లిదండ్రులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్ బాలాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్ చరణ్, చరణ్ కుమార్, వాసు సాయి ధనుష్ దినేష్, ఏఐవైఎఫ్ నాయకులు శివ మధు, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల-2 సాధనకై తొలి ఉద్యమం ఎఐటియుసిదే..

**- సమ్మె నోటీసుపై కీలక పురోగతి**
**-15న ఆర్ఎల్సి సమక్షంలో మరోసారి చర్చలు**
**- విలేకరుల సమావేశంలో**
**అధ్యక్ష కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్**



**ప్రజాపక్షం/చుంచుపల్లిః** తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ సాధన కోసం తొలి ఉద్యమం చేపట్టింది ఎఐటీయూసీనే అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ 2013లోనే సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు గురైన ఘనత ఎఐటీయూసీదేనని అన్నారు. ప్రస్తుతం తాడిచర్ల2 బ్లాక్‌తో పాటు మిగిలిన బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల ఉపాధి భద్రత కోసం ఇది అవసరమని పేర్కొన్నారు. సమ్మె నోటీసుకు సంబంధించి కీలక పురోగతి చోటుచేసుకుందని, ఈ నెల 15న రీజినల్ లేబర్ కమీషనర్ (ఆర్ఎల్సి) సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఎఐటీయూసీ మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయని తెలిపారు. చర్చలు విఫలమై ఆర్ఎల్సీ ఫెయిల్యూర్ రిపోర్ట్ జారీ చేస్తే ఆగస్టులో సమ్మెకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను ప్రతి కార్మికుడికి 40% వాటా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును రద్దు చేయాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అవేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన 56 వేల కోట్ల రూపాయలు వసూలు చేసి సంస్థకు నూతన ప్రాజెక్టులను తీసుకొచ్చి సంస్థ మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బాయిబాటను గూర్చి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఇప్పుడు వారి పట్ల సానుభూతి చూపడం సమంజసం కాదన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వారి కుటుంబ ఆవేదనలను అసెంబ్లీలో నిరంతరం ప్రస్తావించిన ఏకైక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్స్ హుమాయూన్ నాయకులు ఎర్రగాని కృష్ణయ్య, లక్ష్మీ నారాయణ, శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు ఆళ్లపల్లి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్ మాట్లాడుతూ రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల క్లస్టర్లకు పరిమితం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్కే అరిఫ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు కారేపల్లిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు చిన్నవిశెట్టి ఆకాష్ సాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆధునికీకరించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సుకుమార్, పవన్, వెంకటనారాయణ, గోపి, చెన్నకేశవ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ములకలపల్లిలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు ముదిగొండ ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు తెల్లం అఖిల్ మాట్లాడుతూ విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శరత్, కళ్యాణ్, సంజయ్, శేఖర్, నాగచైతన్య, నిశాంత్, దీపు, వంశీ, సాంబ, ఏఐఎస్ఎఫ్ నాయకులు దోణి, నిఖిల్, గోపిక, స్వాతి, లావణ్య, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## నాగన్న సంతాప సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/గుండాల :** అరుణోదయ నాగన్న శనివారం నాడు ఇల్లందులో జరుగు సంతాప సభను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసి మండల కార్యదర్శి కోరం సీతారాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసారపు వెంకన్న అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ అరుణోదయ నాగన్న గోదారిలోయ పరివాహక ప్రాంతమంతా విస్తరించి పేరుగాంచాడని అన్నారు. కానూరి పాటలతో ముగ్ధుడై పార్టీకి పూర్తి కాల కార్యకర్తగా ఎదిగి ,బడుగు బలహీన వర్గాల కోసం , భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ అమర వీరుల పాటలని పాడుతూ , నాగన్న మరణించిన ఆయన పాటలు ప్రజల గుండెల్లో నిలిచి ఉంటాయన్నారు. ఆయన ఆశయాల సాధనకై పోరాడాలని పిలుపునిచ్చారు. గడ్డం లాలయ్య, సూర్యనారాయణ, క్రిప్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/గుండాల :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తం తలపెట్టిన విద్యాసంస్థల బందు లో బాగంగా గుండాల మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటి పాఠశాలలు, కళాశాలలు బందు నిర్వహించడం జరిగింది. ఫాహెద్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే విద్యాశాక మంత్రిని నియమించాలని , ప్రభుత్వం విద్యను నిర్వీర్యంచేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల క్లస్టర్‌గా తగ్గిస్తామన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేని పక్షంలో విద్యార్థి ఉద్యమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌళిసదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షబ్బీర్, యశ్వంత్, రాహుల్, హర్షా తదితరులు ఉన్నారు.

# రెండు రోజులుగా ప్లాంటేషన్లలో విస్తృత తనిఖీలు




**-ప్రజాపక్షం కథనానికి కదిలిన టీజీఎఫ్‌డీసీ యంత్రాంగం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్లలో చోటుచేసుకుంటున్న నిబంధనల ఉల్లంఘనలపై ప్రజాపక్షం దినపత్రికలో వెలువడిన కథనానికి సంస్థ యంత్రాంగం స్పందించింది. సంస్థ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) డీవీ రెడ్డి రెండు రోజులుగా సత్తుపల్లి, కొత్తగూడెం డివిజన్లలో విస్తృతంగా పర్యటించి ప్లాంటేషన్లను పరిశీలించారు. సత్తుపల్లి డివిజన్ పరిధిలోని బుగ్గపాడు, సత్తెంపేట, చంద్రాయపాలెం, కొత్తగూడెం డివిజన్‌లోని నాగుపల్లి, గండుగులపల్లి తదితర ప్లాంటేషన్లలో తనిఖీలు నిర్వహించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం సత్తుపల్లి డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంను వివరణ కోరగా, ఇది సాధారణ తనిఖీల్లో భాగమేనని పేర్కొన్నప్పటికీ, ప్రజాపక్షం కథనంలో ప్రస్తావించిన అంశాలపైనా స్పందించారు. ప్లాంటేషన్లలో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం కాంట్రాక్టర్ల బాధ్యత అని, వారు విఫలమైతే కార్పొరేషన్ తరపున సౌకర్యాలు కల్పించి ఆ వ్యయాన్ని కాంట్రాక్టర్ల నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు. రాత్రి 6 గంటల తర్వాత కార్పొరేషన్ ప్లాంటేషన్ల నుంచి కలప లోడుతో లారీలు బయటకు వెళ్లేందుకు అనుమతి లేదని, అలాంటి ఘటనలు జరిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్లాంటేషన్లలో వ్యర్థాలను తగలబెట్టడం సంస్థ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొంటూ, ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డివిజనల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్లాంటేషన్లలో బాల కార్మికులు పనిచేస్తున్నారన్న సమాచారం ఇవ్వగా, అలాంటి వారు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారిని పనుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ఐదో నెలలో మృతి చెందిన కార్మికుడు ఏసుబాబుకు సంబంధించిన బీమా అంశంపై స్పందిస్తూ, పోస్టుమార్టం నివేదిక అందిన వెంటనే నిబంధనల ప్రకారం ఇన్సూరెన్స్ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంత పెద్ద సంస్థల్లో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతుంటాయి. వాటిని మీడియా మా దృష్టికి తీసుకువస్తే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకుంటాం అని ఆర్ఎం డీవీ రెడ్డి పేర్కొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన మహిళలు, రైతులు



**కాంగ్రెస్ జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరగనున్న రైతు ఆశీర్వాద సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి మహిళలు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మహిళలు, రైతులకు ఇబ్బంది లేకుండా నీళ్ళు,ఆహార ప్యాకెట్లును ముందుగానే సిద్ధం చేశారు. ప్రతి బస్సులోని మహిళలు,రైతులకు కావాల్సిన అహారం, నీళ్ళను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ కాంగ్రెస్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు, రైతులను ఆప్యాయంగా పలకరించి, సభలో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై రైతుల్లో మరింత విశ్వాసం, భరోసా కల్పించడంలో రైతు ఆశీర్వాద సభ దోహద పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మండల పార్టీ అద్యకుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ పట్టణ అద్యక్షుడు గాదే చెన్నారావు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహరావు, కమల్ పాషా, షరీప్, ఆంగోతు రామారావు, అబ్దుల్లా, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగానికి శుభపరిణామం

**- వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు**
**-ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** కృష్ణ–గోదావరి నదుల అనుసంధానంతో వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరడం రైతాంగానికి శుభపరిణామమని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో భాగస్వామ్యం కావడం తన జీవితాన్ని ధన్యం చేసిందని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల కేంద్రంలో నిర్వహించిన కృష్ణ–గోదావరి నదుల అనుసంధాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ముందు స్థానిక సాగర్ కాల్వ వద్ద గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి కాల్వలోకి చేరిన గోదావరి జలాలకు పూలు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గోదావరి జలాల అనుసంధానం వలన వైరా రిజర్వాయర్‌కు సంవృద్ధిగా నీరు అందడంతో పాటు ఖమ్మం జిల్లా పరిధిలోని వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో రైతుల సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గి వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వయక్తం చేశారు. దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న కల నెరవేరుతుందని, రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కొమరారంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ఇల్లందు:** వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు ఇల్లందు మండలం కొమరారం, పోలారం, మర్రిగూడెం, పోచారం, బోయితండా, మాణిక్యారం గ్రామాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మోతిలాల్, జిల్లా నాయకుడు జోగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసే ప్రయత్నాలను విరమించుకోవాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని నియంత్రిస్తూ ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని మహిళా సంఘాలకే కొనసాగించాలని, విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఇల్లందు మండల కార్యదర్శి మూడు మాలు, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోతిలాల్, జిల్లా నాయకుడు జోగా కృష్ణ, మల్లెల కృష్ణ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభకు రఘునాథపాలెం మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు మండలం నుంచి స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, రైతులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులను ఏర్పాటు చేయడంతో మహిళలు, రైతులతో పాటు కాంగ్రెస్ శ్రేణులు కూడా తరలి వెళ్లారు. సభకు వెళ్లిన వారికి తాగునీరు, భోజన సౌకర్యాన్ని స్థానిక నాయకులు ఏర్పాటు చేశారు.

# రైతు ఆశీర్వాద సభకు భారీగా తరలిన రైతులు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రైతు ఆశీర్వాద భారీ బహిరంగ సభకు పెనుబల్లి మండలం నుండి భారీగా శుక్రవారం తరలి వెళ్లారు. పెనుబల్లి మండలంలో 33 గ్రామ పంచాయతీల నుండి మహిళలు, రైతులు,యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 40 కి పైగా బస్సులలో సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలి వెళ్లారు. సభకు బయలుదేరిన వారికి ఆహార పానీయాలు సిద్ధం చేసి అసౌకర్యం కలగకుండా గ్రామాలలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా సభకు తరలి వెళుతున్న పలువురు నాయకులు మాట్లాడుతూ రైతు ఆశీర్వాద సభకు మండలం నుండి స్వచ్ఛందంగా ప్రజలు తరలి రావడం సంతోషంగా ఉందని అన్నారు. రైతు ఆశీర్వాద సభతో ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను నేరుగా రైతు అకౌంట్లోకి జమ చేయడం ఖమ్మం జిల్లా వాసులుగా తమకు గర్వంగా ఉందని అన్నారు. రైతు సంక్షేమమే పరమావధిగా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వారు వివరించారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు ఆశీర్వాద సభకు ఎర్రుపాలెం మండలం నుండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా రైతులు, కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. చింతకాని మండలం జగన్నాథపురంలో శుక్రవారం జరిగిన రైతు ఆశీర్వాద సభకు మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల నుండి నాయకులు భారీగా జన సమీకరణ చేశారు. జమలాపురంలో బస్సు యాత్రను గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి, ప్రముఖ వ్యాపారవేత్త తుళ్లూరు కోటేశ్వరరావు, వెంకటాపురం గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళలు అధికసంఖ్యలో ఈ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మండల కాంగ్రెస్ నాయకులు బండారు నర్సింహారావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి,అనుమోలు వెంకటకృష్ణారావు, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, తుళ్లూరు కోటేశ్వరరావు, మూల్పూరు శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/వైరా:** చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభకు వైరా నియోజకవర్గం భారీగా తరలి వెళ్లినట్లు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వైరాలో బస్సులను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శుక్రవారం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తో కలిసి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ రైతు కోసం రైతు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా అన్ని విధాలా ఆదుకునేందుకే ప్రభుత్వం ముందుకు వచ్చిందని, ఏ రైతు కూడా ఎక్కడ కష్టపడకుండా చూడడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ చైర్మన్ గంగారావు, కాంగ్రేస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు, పమ్మి అశోక్, చెరుకూరి కిరణ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, పగడాల మంజుల, వీరంశెట్టి సీతారాములు, వడ్డే నారాయణ, మల్లు రామకృష్ణ, జవ్వాజి నాగరాజు, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించిన రైతులు

**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం నిధుల విడుదల రైతు ఆశీర్వాద సభ కార్యక్రమాన్ని శుక్రవారం కరకగూడెం మండలంలోని బట్టుపల్లి రైతు వేదిక నుండి రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులకు రైతు భరోసా పథకం ప్రాముఖ్యతతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయబడుతున్న సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం

**- రేవంత్ సర్కార్‌పై వామపక్ష విద్యార్థి సంఘాల ఆగ్రహం**
**- జిల్లాలో విద్యా సంస్థల బంద్ విజయవంతం**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం ఆటలాడుతోందని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు అజిత్, నాగకృష్ణ,వీరభద్రం, ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకీ సంక్షోబంలో నెట్టబడుతోందన్నారు. మూడేళ్లుగా రాష్ట్రానికి విద్యాశాఖా మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం 27వేల పాఠశాలలు మూసివేసే ఆలోచనను విమరించుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. ప్రైవేటు, కార్పోరేటర్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. రూ.10814 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలతో పాటు రూ.250 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీల్ నిధులను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రానికి తక్షణమే విద్యాశాఖా మంత్రిని నియమించాలని విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని, ఇంటర్, డిగ్రీకాలేజీల్లో మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించాలని, విద్యా సంస్థల్లో మౌళిక వసతులు, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనిస, ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, నూతన జాతీయవిద్యావిధానానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తీర్మాణం చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విద్యార్థులకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు నాయకులు మాణిక్యాల విజయ్, కొరిమి సంజయ్, సాయి సంతోష్, గుగులోత్ వీరభద్రం, విఘ్నేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలి

**- ఎస్‌పి రోహిత్ రాజ్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. లక్ష్మీ దేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ సిసిటిఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్ధవంతంగా వినియోగించి పోలీస్ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సిఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంసాఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సైబర్ నేరాల భారినపడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలలకు సూచనలు చేయాలన్నారు. ప్రజలు కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ, చుంచుపల్లి సిఐ ఆర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు అఖిల, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల పాదయాత్రను జయప్రదం చేయండి

**- ఏఐటియూసి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ (ఏఐటియూసి) ఆధ్వర్యంలో ఆదివారం నుండి చేపట్టిన పాదయాత్రను జయప్రథం చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ సీతామహాలక్ష్మీ తో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీల్లో సేవ్ ఐసిడిఎస్, సేవ్ అంగన్వాడీ సెంటర్స్ నినాదంతో భద్రాచలం నుండి కొత్తగూడెం వరరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవడంలో విఫలమయ్యారన్నారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు రూ.18వేల వేతనం అమలు చేయాలని, బిఎల్‌ఓ డ్యూటీలతో పాటు ఇతర అదనపు పనులను రద్దు చేయాలని, ప్రీప్రైమరీ సెంటర్లు ఉపసంహరించుకోవాలని, రూ.1కోటి ప్రమాదబీమా, హెల్త్ కార్డులు, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పాదయాత్ర ప్రారంభం అవుతుందని. ఈ పాదయాత్రకు ఏఐటియూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ ప్రారంభిస్తారని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, వేల్పుల మల్లిఖార్జున్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణి, రెడ్డి అరుణ, సంధ్య, పాయం లత, చిన్నారి, శోభారాని, అనిత పార్వతి, శ్రీదేవి, సరోజ,, కమల తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర్ సెక్టార్ పరిధిలోని లక్ష్మీపురంలోగల ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి, చిన్నారులకు యూనిఫాంలను స్థానిక సర్పంచ్ బి వెంకటేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈసందర్భంగా బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, ఈనెల13న డీవార్మింగ్ మాత్రలు తప్పని సరిగా వేయించుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ బి స్వరాజ్యం మాట్లాడుతూ చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బి భూలక్ష్మి , బి దేవకరుణ, ఏడబ్ల్యూహెచ్ పి అక్కమ్మ, కే ఉషారాణి, ఏఎన్‌ఎం ఎస్ రోషమ్మ, ఆశ ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు




**ప్రజాపక్షం/కారేపల్లి:** మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొన్న రైతు ఆశీర్వాద సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కారేపల్లి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులు

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పాలకుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులు ఇంకా వెనుకబడే ఉన్నారని, గిరిజనుల హక్కులు కోసం, వారి సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ వారికి అండగా నిలబడి నిరంతరం పోరాటం చేస్తుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం గ్రామంలోని నాయకపోడు గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం వచ్చిన కవిత గిరిజనుల జీవన పరిస్థితులు, వారి గృహాలను పరిశీలించారు. అనంతరం స్థానిక గిరిజనులతో కలిసి నేలపై కూర్చుని సాధారణ భోజనం చేశారు. వారితో కాసేపు ముచ్చటించి స్థానికంగా ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలు, తాగునీరు, మౌలిక వసతుల కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వలన గిరిజన గూడాలు ఇంకా వెనుకబడే ఉన్నాయని మండిపడ్డారు. అన్న రాజ్యం కాదు రాబోయే రోజుల్లో అక్క రాజ్యం ఎలా ఉంటుందో పేదల పక్షాన నిలబడే పాలన ఎలా ఉంటుందో చూపిస్తా అంటూ సవాల్ విసిరారు. గిరిజనుల హక్కులు, వారికి రావాల్సిన సంక్షేమ ఫలాల కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ నిరంతరం అండగా ఉంటుందని, ప్రతి సమస్యపై అసెంబ్లీలో లోపలా, వెలుపలా పోరాడుతామని కవిత హామీ ఇచ్చారు. అశ్వారావుపేట మండలంలో తొలిసారిగా పర్యటించిన కవితకు నాయకపోడు గిరిజనులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. కవితపై పూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గిరిజన సంఘాల పెద్దలు, గిరిజనులుపాల్గొన్నారు.

# సిడిపిఓ కార్యాలయం ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు సిడిపిఓ కార్యాలయం ఎదుట అంగన్వాడి మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ల సహాయకుల కు ప్రభుత్వ టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు, పెన్షన్, సిపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 18000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులను భర్తీ చేయాలని, బి. ఎల్వో కు సర్ డ్యూటీలు రద్దు చేయాలన్నారు. ఐసిడిఎస్ పథకానికి తగిన నిధులు కేటాయించి బలోపేతం చెయ్యాలని కోరారు. పదవి విరమణ పొందిన అంగన్వాడీలకు గ్రాడ్యుటి చట్టం ప్రకారం రిటైర్మెంట్ ప్రయోజనాలు పొందే విధంగా చూడాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అంగన్వాడి కేంద్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# అధికారంతో అడ్డదారిలో బిల్లులు

**-రంగం సిద్ధం చేసిన ప్రజాప్రతినిధులు**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అధికార పార్టీ బలంలో చంద్రుగొండ పంచాయితీలో అడ్డదారిలో రూ లక్షల రూపాయలు కాజేసేందుకు ప్రజాప్రతినిధులు సిద్ధం అయ్యారని చంద్రుగొండ గ్రామానికి చెందిన యువజన నాయకులు రాయి రాజా, ఎస్‌కె నాగుల్‌మీరా, తంబళ్ల మంగయ్యలు ఆరోపించారు. శుక్రవారం చంద్రుగొండ గ్రామ పంచాయితీలో అడ్డదారిలో బిల్లులు డ్రా చేసేందుకు సిద్ధంగా ఉన్న మట్టి రోడ్లను(గ్రావెల్ రోడ్లు)యువజన నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సిఎం రేవంత్‌రెడ్డి మండల పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలానికి తోలిన గ్రావెల్‌ను కొన్ని అంతర్గత రోడ్లకు పోసి, పంచాయితీరాజ్ అధికారులనను అడ్డుపెట్టుకొని రికార్డులు(ఎంబిలు)తయారు చేసుకొని, తప్పుడు మార్గంలో రూ లక్షల రూపాయలు కాజేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని ఆరోపించారు. పంచాయితీరాజ్ అధికారులు పనులు జరగకుండా ఎలా బిల్లులు చేస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు ఎలా చెబితే చంద్రుగొండ గ్రామ పంచాయితీలో అలా బిల్లులు, డబ్బులు డ్రా అవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. మండల పరిషత్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**-విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అశ్వాపురం మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈనపల్లి పవన్ సాయి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల క్లస్టర్లకు కుదించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న రూ 7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి నాగేంద్రబాబు, మండల నాయకులు ఈనపల్లి సిద్ధార్థ, గద్దల వినయ్, ఈనపల్లి గణేష్, పడిదల నిఖిల్, సంజయ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

# అరువివ్వని అరుణోదయ గొంతుక

## -నేడు నాగన్న సంస్మరణ సభ






కళలు, గళాలు అమ్ముడుపోతూ సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న నేటి సమాజంలో విప్లవోద్యమ, సామాజిక గీతాలకు మినహా తన గొంతును అరువివ్వని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఆర్థిక, రాజకీయ ఇబ్బందులు చుట్టు ముట్టిన వెరవక తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. సినిమా గాయకుడిగా, విప్లవోద్యమ గాయకుడిగా పేరొందిన ఒక సామాజిక జీవితం గడుపుతూ కడ వరకు తాను నమ్మిన పాటను పాడుతూ విప్లవోద్యమానికే జీవితాన్ని అంకితం చేసిన అరుదైన వ్యక్తుల్లో అరుణోదయ నాగన్న ఒకరు. పూటకో పార్టీ మారుతూ ఎవరు అధికారంలో ఉంటే వారి భజన గీతాలు పాడుతున్న ఈ రోజుల్లో అరుణోదయ సాహితీ సాంస్కృతిక సంస్థలో పనిచేస్తూ అరుణోదయనే ఇంటి పేరుగా మార్చుకున్న పరకాల నాగన్న నేటి తరానికి ఆదర్శం. తిరుమలాయపాలెం మండలం రాజారాం గ్రామంలో 1957లో పరకాల పాపయ్య, లచ్చుమమ్మ ప్రథమ కుమారునిగా జన్మించిన నాగయ్య చిన్న తనంలోనే పాటలు పాడుతుండే వాడు. ముఖ్యంగా బుర్ర కథలు, రైతు కూలీలకు సంబంధించిన పాటలు పాడుతుండే వారు. కంఠం బాగుందని గ్రామస్తులు అభినందిస్తున్న అదే సమయంలో శ్రీపాద శ్రీహరి పరిచయం అయ్యాడు. అలా కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షించబడ్డాడు. 1976లో విప్లవ కళాకారుడిగా పరిచయం అయిన నాగన్న అనేక నిర్బంధాలు, సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజా చైతన్యానికి తన గొంతుకను అంకితం చేశాడు. చదువుకున్నది ప్రాథమిక విద్య అయినా నిబద్ధత గల కమ్యూనిస్టు కార్యకర్తగా రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గొంటూ రాటు దేలాడు. తన మేనత్త కూతురు గౌరమ్మను వివాహం అడగా విప్లవోద్యమ సహచార్యంలో గౌరమ్మ లక్ష్మి గా మారింది. 1980 దశకంలో నాగన్న పాట విననిపల్లె ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాటు నల్గొండ, వరంగల్ జిల్లాల్లో లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోనూ ఆయన గానం ఉర్రూతలూగించింది. ఆయన పాడినా, బుర్రకథ చెప్పినా జనాన్ని తన గొంతుకతో కట్టిపాడేసే వారు. తెలంగాణ ఉద్యమంలో 400 సభల్లో పాల్గొని ధూంధాం చేసి తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించాడు. రచయితగా, గాయకుడిగా బుర్రకథ, యక్షగానం, జముకుల కథ, హరికథ, జనగానం, గొల్లసుద్దులు, పిట్టలదొర లాంటి అనేక కళా రూపాలను ప్రదర్శించి ప్రజలను మెప్పించాడు నాగన్న. ముఖ్యంగా సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన పోట్ల రామనర్సయ్య ఎన్‌కౌంటర్ తర్వాత వచ్చిన అన్న అమరుడురా మన రామనర్సయ్య అన్న పాట నాగన్న గొంతుక వెంట వింటే చెమర్చని కండ్లు లేవంటే అతిశయోక్తి కాదు. చేతి వేళ్లను నరికినారు, చిత్రహింసలు పెట్టినారు అన్న చరణం పాడేటప్పుడు నాగన్న గొంతులోని ఆర్ద్రత వింటే తప్ప చెప్పడానికి సాధ్యం కాదు. తన గురువుగా చెప్పుకున్న కానూరి వెంకటేశ్వరరావు రచించిన వీరగాధలా పాడరా విప్లవ వీరచరితలా పాడరా అన్న పాట ఒకానొక సందర్భంలో అనేక మందిని విప్లవోద్యమం వైపు మళ్లించింది. ఈ శిల్పులు ఎవ్వరో ఈ కూలీలెవ్వరో అని పాడినా కొంగు నడుముకు చుట్టవ్వె చెల్లెమ్మ కొడవళ్ల చేపట్టవ్వే చెల్లెమ్మ అంటూ పాడి మహిళలను ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షించిన ఒక నాగన్నకే చెల్లుబాటు అవుతుంది. ఎర్రపూల వనంలోనా పువ్వు రాలిందో నగారారిలో అన్న పాట విప్లవ సాంస్కృతికోద్యమంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఈ పాటను స్వయంగా నాగన్న రాసి పాడారు. అనేక పాటలు పాడి జీవితాన్ని అరుణోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్యకు అంకితం చేసిన నాగన్న వ్యక్తిగత జీవితాన్ని కూడా ఒకసారి పరికించక తప్పదు. నాగన్న పేరు చెబితే విప్లవోద్యమంతో ఏ మాత్రం పరిచయం ఉన్న వారైనా ఇట్టే చెప్పేస్తారు. ఎందరినో విప్లవోద్యమం వైపు మరల్చి తన విప్లవ కర్తవ్యాన్ని నెరవేర్చిన నాగన్న ఆర్థికంగా ఒక విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రి సమీపంలో కాల్వ కట్టపై ఒక చిన్న గుడిసెను ఏర్పాటు చేసుకుని దానిలోనే ఒక దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణ సాగించాడు. తాను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా తన వారసుడైనా అజయ్‌ను మాత్రం విప్లవోద్యమం వైపు వెళ్లేలా చూశాడంటే విప్లవోద్యమం పట్ల ఆయనకు ఉన్న అంకిత భావానికి అద్దం పడుతుంది. మారిన పరిస్థితుల్లో సంపాదన ఒక మార్గంగా ఎంచుకున్న నాయకులు ఉన్న ఎర్ర జెండా పార్టీల్లోనూ చుక్కల్లో చంద్రుడ్లా నాగన్న నిలిచిపోతాడు. అమావాస్యనాడైనా చంద్రుడు అంతర్థానమవుతాడేమో కానీ నిరంతరం చల్లని వెన్నెలను ఇచ్చే నాగన్న మాత్రం నిత్య స్మరణీయుడు. ఇటీవల కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన పాటలలో చికాగో నగరాన చిందిన రక్తంలో తడిసిన ఎర్రగుడ్డ అది ఎట్ల చేరిందో రోళ్లగడ్డ ఒకటి ప్రస్తుతం పలు సందర్భాల్లో జరుగుతున్న వేడుకల్లో రాజకీయాలకు అతీతంగా ఈ పాటను వింటున్నారంటే ఆ పాట గొప్పతనం తెలుస్తుంది. సాయుధ పోరాటంలో నేలకొరిగిన అమరుడు లింగన్నను స్మరిస్తూ యోచన రచించిన ఈ పాట పాడటం ద్వారా నాగన్న గొంతు అమరత్వం పొందింది. లింగన్నే కాదు పాట పాడిన నాగన్న రాసిన యోచన కూడా స్మరణీయులే. ఈ సందర్భంగా ఓ వ్యక్తి ప్రస్తావన కూడా అవసరం. నాగన్న జీవితానికి సంబంధించిన పుస్తకం వచ్చినప్పుడుకానీ, నాగన్న తీవ్ర అనారోగ్యానికి గురై చాలా రోజులు ఆసుపత్రిలో గడపాల్సి వచ్చినప్పుడు కానీ ఓ వ్యక్తి దన్నుగా నిలిచాడు. ఆయనే కాకి భాస్కర్ (స్వర్ణ భాస్కర్) తాను నిర్వహిస్తున్న ఆసుపత్రిలో సుదీర్ఘ కాలం ఉచిత వైద్యాన్ని అందించి ఓ విప్లవ గొంతుకు అప్పుడే మూగపోకూడదని గట్టి ప్రయత్నమే చేశాడు. అయినా నాగన్న గొంతుక మూగబోయింది. కానీ ఆయన గానం అమరత్వాన్ని పొందింది. ఎర్ర జెండా ఎగురుతున్న కాలం, ప్రజా కళలు వర్ధిల్లినంత కాలం చైతన్య గీతికలు వినపడినంత కాలం నాగన్న గుర్తుకు వస్తూనే ఉంటాడు. ఈ అరుణోదయ నాగన్న అమరుడు. నిత్య స్మరణీయుడు.

**నేడు సంస్మరణ సభ :**

నాగన్న మిత్రులు ఆయన సంస్మరణ సభను శనివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటు చేశారు. అనేక మంది కవులు, కళాకారులు ఈ సంస్మరణ సభలో పాల్గొననున్నారు. అరుణోదయ విమలక్క, జీవన్, ఏపూరి సోమన్న, నాగేశ్వరరావు, ఎస్ పాల్, యోచన తదతర ప్రముఖులు ఈ సంస్మరణ సభకు హాజరు కానున్నారు.

-ప్రజాపక్షం/ఖమ్మం

# కొత్తగూడెం ఆటో స్టాండ్లలో షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**- కమీషనర్ సుజాతకు ఏఐటీయూసీ వినతి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం పట్టణంలోని ఆటో స్టాండ్లలో ప్రయాణికులు, ఆటో కార్మికులకు అవసరమైన షెడ్లను వెంటనే నిర్మించాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెం ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధి బృందం కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్ సుజాతను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ, గత మున్సిపల్ పాలకవర్గ హయాంలో ఆటో స్టాండ్లకు షెడ్లు నిర్మించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక దఫాలుగా ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగా అప్పటి సిపిఐ కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆటో స్టాండ్లకు షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, కౌన్సిల్ ఆమోదం కూడా పొందారని గుర్తుచేశారు. ఈ విషయాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ కమీషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆటో స్టాండ్ షెడ్ల నిర్మాణానికి అవసరమైన అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ కమీషనర్ సుజాత సానుకూలంగా స్పందించి, ఆటో స్టాండ్లలో షెడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు అబ్బులు, పట్టణ కార్యదర్శి దేశి, వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్టు శీను, చప్పిడి కోటేశ్వరరావు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దులో అక్రమ కలప పట్టివేత

**-సుమారు రూ 66,968 విలువ -నిందితుల కోసం గాలింపు**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ ఆదేశాల మేరకు దుమ్ముగూడెం అటవీ పరిధి అధికారి ఎం కమల ఆధ్వర్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని డి కొత్తూరు బీట్ అటవీ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అక్రమంగా నరికి దాచిన మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. 0.444 ఘన మీటర్ల పరిమాణం గల దుంగల విలువ రూ 66,968గా అంచనా వేశారు. ఘటనపై అటవీ నేర కేసు నమోదు చేసి, కలపను భద్రాచలం టింబర్ డిపోకు తరలించారు. అక్రమంగా నరికిన వ్యక్తుల కోసం గాలింపు కొనసాగుతోందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన క్షేత్రస్థాయి సిబ్బందిని, ముఖ్యంగా మహిళా అటవీ అధికారులను జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ అభినందించారు. అక్రమ కలప రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండల ఆశ్రమ ఉన్నత పాఠశాల(ఏహెచ్ఎస్)నారాయణరావు పేటను గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎస్ చందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండో తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. హాస్టల్ పరిశుభ్రత లోపాలను గుర్తించి సంబంధిత ఇన్‌చార్జిని హెచ్చరించిన ఆమె, నివాస గృహాలను ప్రతి రోజూ శుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, బోధనలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, విద్యార్థుల హాజరు పెంపు, బడికి రాని విద్యార్థులను తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం వంటకు గ్యాస్ మాత్రమే వినియోగించాలని, కట్టెలను ఉపయోగించరాదని సూచించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని కూడా పరిశీలించి, లోపాలను సరిద్దాలని ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావుకు సూచించారు. అనంతరం జీపీఎస్ నారాయణరావుపేటను సందర్శించి, అవసరమైన పాఠశాల బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, బాలాజీ, నాగభూషణం, కోటేశ్వరరావు, వెంకట్, కళ్యాణి, ఏఎన్ఎం సుభద్ర పాల్గొన్నారు.

# విద్యుత్ కనెక్షన్ల పేరుతో వసూళ్లు..?

**- ఒక్కో రైతు నుండి పది వేలకు పైగా.. - బోర్లు లేని రైతుల వద్ద నుండి అదనంగా.**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఉచిత విద్యుత్ పథకం మాటున ఓ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నారనే వదంతులు మండల వ్యాప్తంగా షికార్లు పుకార్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 2026 సంవత్సరం జనవరి నుండి రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ స్కీమ్ ప్రవేశపెట్టింది. దీనికి మీటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 5 హెచ్‌పి మోటార్‌కు సుమారు రూ. 9500/లు ఫీజు నిర్ణయించారని తెలుస్తోంది. రైతులు సాగు కోసం ఏర్పాటు చేసుకొన్న వ్యవసాయ బోర్లకు, బావులకు ఒక కిలో మీటర్ వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నది. ఈ మేరకు అవసరమైన స్తంభాలను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వనున్నారు. దీనిని అవకాశంగా తీసుకొన్న మండల విద్యుత్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో రైతు వద్ద నుండి 10 వేయిల నుండి 15 వేయిల వరకు వసూళ్ళు చేస్తున్నారనే ఆరోపణలు మండల వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. లేని బోర్లకు సైతం కనెక్షన్ ఇప్పించటానికి ఓ సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ ఆర్టిజన్ మధ్య వర్తిగా వ్యవహరిస్తున్నారని తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పాల్వంచ సబ్ డివిజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ రహీముల్ హుస్సేన్ వివరణ కోరగా అత్యవసర పనిలో ఉన్నానని కావలసిన సమాచారాన్ని మా ఏఈని అడిగి తీసుకోవాలని చెప్పారు, అనంతరం మండల ఏఈని చరవాణి ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చండ్రుగొండ మండలంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఉదయ్ కిరణ్, నర్సింహారావు మాట్లాడుతూ 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల క్లస్టర్లుగా కుదించే ఆలోచనను విరమించుకోవాలని, విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ 7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్‌చరణ్, చరణ్‌కుమార్, వాసు, సాయి, ధనుష్, దినేష్, విజయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కారేపల్లి మండల కేంద్రంలో విద్యాసంస్థల సంపూర్ణ బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కే నరేంద్ర, పీవైఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పిడిఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు సంజయ్, లోకేష్, భరత్, వినయ్, నందకిషోర్, రాకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.